సాక్షి తిరుపతి

సోమవారం ၊ 1 ၊ ఏప్రిల్ ၊ 2024



వైఎస్సార్‌సీపీలోకి వలసలు

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో టీడీపీ, జనసేన నుంచి పలువురు నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు.

- 8లో



క్రీడలతో ఆరోగ్యం.. ఆనందం

తిరుపతి అలిపిరిలోని గరుడ సర్కిల్ నుంచి 2కే మారథాన్‌ను సినీ నటుడు శ్రీరామ్ ప్రారంభించారు.

- 8లో



న్యూస్‌రీల్

ముగిసిన 'టాలెంట్ ఫెస్ట్'



మాట్లాడుతున్న ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న నేషనల్ టాలెంట్ ఫెస్ట్–24 ఆదివారం ఘనంగా ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి, సీఐడీ ఎస్పీ ఎస్వీఎస్ స్వామి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యార్థులలోని ప్రతిభను వెలికితీసేందుకు సంస్కృత వర్సిటీ టాలెంట్ ఫెస్ట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి ఎంతో మంది సంస్కృత విద్యార్థులు పాల్గొని బహుమతులు పొందడం వారి ప్రతిభకు నిదర్శనమన్నారు. కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారు వర్చువల్ విధానంలో అనుగ్రహ భాషణం చేశారు. సంస్కృతం అభివృద్ధికి వర్సిటీ మరింత కృషి చేయాలని సూచించారు. అనంతరం సాంస్కృతిక, క్రీడా, యోగా, క్విజ్ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కాంచీపురం చంద్రశేఖరేంద్ర, వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ విష్ణుపతి, ఎస్ఎస్‌యూ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, డీన్‌లు ప్రొఫెసర్ దక్షణమూర్తి శర్మ, ప్రొఫెసర్ టీవీ రాఘవాచార్యులు పాల్గొన్నారు.

3న పింఛన్ల పంపిణీ

తిరుపతి అర్బన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ, వార్డు సచివాలయాల్లోనే ఈనెల 3 నుంచి 8వ తేదీ వరకు పింఛన్లు పంపిణీ చేయనున్నారు. ఒక్కో సచివాలయంలో వివిధ విభాగాలకు చెందిన పది మంది ఉద్యోగులు పనిచేస్తున్న నేపథ్యంలో పింఛన్లు పంపిణీ చేయడానికి అందరికీ లాగిన్ అవకాశం కల్పించారు. పింఛన్‌దారులు వారి పరిధిలోని సచివాలయాలకు వెళ్లి పింఛన్లు తీసుకోవాల్సి ఉంటుంది.

గడువు పొడిగింపు

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్రంలోని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ఫస్టియర్, అలాగే పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో అడ్మిషన్లకు నిర్వహించనున్న ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 5వ తేదీ వరకు గడువు పొడిగించారు. ఆ మేరకు విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న ఏపీఆర్‌జేసీ, 27న పాలిసెట్ ప్రవేశ పరీక్షలు జరగనున్నట్టు వెల్లడించారు. వివరాలకు 86888 88802, 93999 76999నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

నేటి నుంచి 'పది' మూల్యాంకనం

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. తిరుచానూరు జెడ్పీ హైస్కూల్లో స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం ఏర్పాటుచేశారు. 8 రోజుల్లోనే మూల్యాంకనం పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో 1.80లక్షల జవాబు పత్రాలు జిల్లాకు ఇప్పటికే చేరుకున్నాయి. స్పాట్ వాల్యుయేషన్ క్యాంప్ ఆఫీసర్‌గా డీఈఓ శేఖర్, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌గా అసిస్టెంట్ కమిషనర్ గురుస్వామి, చీఫ్ కోడింగ్ ఆఫీసర్లుగా జి.సురేష్, శ్రీహరి వ్యవహరించనున్నారు. అలాగే మరో 10మంది సీనియర్ హెచ్ఎంలు అసిస్టెంట్ క్యాంపు ఆఫీసరుగా వ్యవహరించనున్నారు.

గంగ పుత్రుల బెంగ తీరే!



అనంతసాగరంతో పోరాటం.. నిత్యం ప్రాణాలతో చెలగాటం.. చేపల వేట తప్ప మరొకటి తెలియని గంగపుత్రుల జీవితం.. రెక్కలు ముక్కలు చేసుకుంటే తప్ప పూట గడవని కడు పేదరికం.. ఎవరికీ పట్టని జాలర్ల బతుకుల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెలుగులు నింపింది. సంక్షేమ పథకాలతో అండగా నిలబడింది. వేట విరామ సమయంలో సైతం కుటుంబ పోషణకు 'భరోసా' కల్పించింది. మత్స్యకారుల కలలను సాకారం చేస్తూ పులికాట్ ముఖద్వార పూడిక తీత పనులు చేపట్టింది. ఇంధన రాయితీలతో బాసటగా నిలిచింది.



ఒడ్డుకు చేరిన పడవలు (ఫైల్)

- మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు
- మెరైన్ జాలర్ల తరహాలో రూ.10వేల మత్స్యకార భరోసా
- మరబోట్ల డీజిల్‌కు లీటర్‌కు రూ.9 సబ్సిడీ
- 50 సంవత్సరాలకే వృద్ధాప్య పింఛన్
- 60 శాతం సబ్సిడీతో ఫిష్ ఆంధ్రా సెంటర్లు
- పులికాట్ ముఖ ద్వారాల పూడిక తీతకు రూ.128 కోట్లు మంజూరు
- ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం ఆదుకుందంటున్న జాలర్లు

తడ: మత్స్యకారులకు ఊహించని రీతిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాయం అందించింది. పులికాట్ సరస్సునే నమ్ముకుని జీవిస్తున్న 16 జాలర్ల కుప్పాల్లోని 15వేల మంది, సూళ్లూరుపేట మండలంలోని తోటకట్ల గ్రామంలో పులికాట్ సరస్సునే నమ్ముకున్న గంగ పుత్రులకు బాసటగా నిలిచింది. దీంతో ఈ గ్రామాల నుంచి 314 పడవల్లో మత్స్యకారులు వేటకు వెళ్లి చేపలను పట్టి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే మత్స్య సంపద అనుకున్నంత లేకపోవడంతో జాలర్ల జీవితాలు దుర్భరస్థితికి చేరుకున్నాయి. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పలు ప్రోత్సాహక పథకాలు అమలు చేసి వారి కుటుంబాల్లో వెలుగులు నింపింది.

మరబోట్లకు సబ్సిడీపై డీజిల్

వేట కోసం వినియోగించే మర బోట్లకు ప్రభుత్వం సబ్సిడీతో డీజిల్ అందిస్తోంది. నెలకు ఒక్క బోటుకు 300 లీటర్ల డీజిల్‌పై లీటర్‌కు రూ.9 సబ్సిడీ లభిస్తుంది. 314 బోట్లకు సంబంధించి 600 మంది మత్యకారులకు 94,200 లీటర్లకు నెలకు రూ.8,47,800 లబ్ధి చేకూరగా, ఏడాదికి రూ.1,01,73,000లు రాయితీ రూపంలో అందించింది. గతంలో రాయితీ డీజిల్ కోసం కోట పట్టణంలోని పెట్రోల్ బంక్‌కు తడ మత్స్యకారుల వెళ్లాల్సి వచ్చేది. దీంతో ఎంతో శ్రమ, ఖర్చు అయ్యేది. దీన్ని గుర్తించిన ప్రభుత్వం తడలోని పెట్రోల్ బంక్‌లోనే సబ్సిడీ డీజిల్ అందించేలా చర్యలు తీసుకుని ఖర్చులు తగ్గించింది.

పూడిక తీతతో మత్స్యసంపద వృద్ధి

ముఖ ద్వారాలు పూడిపోవడంతో పులికాట్‌లో మత్స్య సంపద తగ్గిపోయి జాలర్లకు జీవనం గగనమైంది. దీనిపై దశాబ్దాలుగా జాలర్లు ఆందోళన చేస్తూనే ఉన్నారు. దీనిపై ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎంపీ గురుమూర్తి చట్ట సభల్లో ప్రస్తావించారు. దీంతో రాయదొరువు వద్ద ముఖ ద్వారం పూడిక తీత కోసం రూ.128 కోట్లు మంజూరు అయ్యాయి.

ఫిష్ ఆంధ్రా సెంటర్లతో ఉపాధి

మత్స్యకార యువకులకు ఉపాధి కల్పించేందుకు మండలంలో పది ఫిష్ ఆంధ్రా సెంటర్లు నెలకొల్పారు. అటు యువతకు ఉపాధి, ఇటు ప్రజలకు నాణ్యమైన చేపలు సరసమైన ధరలకు లభించేలా ఈ సెంటర్లు ఏర్పాటు చేశారు. యూనిట్ పెట్టుబడిపై 60 శాతం రాయితీ ప్రభుత్వం అందిస్తోంది. అలాటే మూడు ఎకరాల విస్తీర్ణంలో రూ.2 కోట్ల వ్యయంతో ఫిష్ లాండింగ్ సెంటర్ నెలకొల్పేందుకు కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. మత్స్యకారులకు 75 శాతం సబ్సిడీతో వలలు, పడవలు అందించేందుకు చర్యలు చేపట్టింది.



పులికాట్ సరస్సులో పట్టుకున్న మత్స్య సంపదను ఒడ్డుకు చేరుస్తున్న జాలర్లు (ఫైల్)

50 ఏళ్లకే పింఛన్

సముద్రంలో వేట, జీవన విధానం, సరైన పోషణ లేకపోవడం వంటి కారణాలతో జాలర్లు తక్కువ వయసులోనే శారీరకంగా బలహీనమవుతున్నారు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం మత్స్యకారులకు 50 ఏళ్లకే పింఛన్ అందించేలా చర్యలు తీసుకుంది. దీంతో ప్రస్తుతం మండలంలోని 429 మంది మత్స్యకారులకు రూ.12లక్షల 87వేల 700 పింఛన్ కింద ప్రతి నెలా అందిస్తోంది.

1,884 మందికి మత్స్యకార భరోసా

వేట నిషేధం పేరుతో మూడు నెలలు(ఏప్రిల్ నుంచి జూన్ వరకు) విరామం ఉంటుంది. ఈ సమయంలో మత్స్యకారులకు పూట గడవడం కూడా కష్టంగా ఉంటుంది. వేట నిషేధం ఉండే నెలల్లో జాలర్లకు గతంలో ప్రభుత్వం ద్వారా రూ.4 వేలు జీవన భృతి లభించేది. వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం వచ్చాక జాలర్ల అవస్థలను గుర్తించి రూ.10 వేలకు పెంచి ఆదుకుంది. మొత్తం 1,884 మందికి రూ.కోటి 88లక్షల 40 వేల లబ్ధి నేరుగా వారి ఖాతాల్లోకి చేరుస్తోంది.

ఊహించని విధంగా మేలు



మత్స్యకారులు ఊహించని విధంగా ప్రభుత్వం ఆదుకుంది. సమస్య నెలకొన్న సమయంలో అధికారులు, నాయకులు కొద్ది రోజులు హడావిడి చేసి వివాదాలు సద్దుమణిగాక నిమ్మకుండిపోతారు. తరువాత ఎవరూ పట్టించుకోరు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మత్స్యకారులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారికి అవసరమైనవన్నీ అడగకుండానే చేసి, ఆర్థిక భరోసా ఇచ్చింది.

– కె.ఆర్ముగం, మత్స్యకార నాయకుడు, తడ

ఆర్థికంగా అండ



డీజిల్ కోసం దూర ప్రాంతానికి వెళ్లకుండా దగ్గరలోని పెట్రోల్ బంక్‌లో ఇచ్చేలా చేసి వ్యయ, ప్రయాసలను ప్రభుత్వం తీర్చింది. వేట లేని సమయంలో రూ.పది వేల భృతి ఇచ్చి గతంలో ఎవరూ ఆదుకోని విధంగా ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలిచింది. – వినోద్, మత్స్యకారుడు

మాటల్లో చెప్పలేను



ఎవరూ ఊహించని రీతిలో 50 సంవత్సరాలకే మత్స్యకారులకు పింఛన్ పథకం వర్తించడం ముందు చూపునకు నిదర్శనం. మత్స్యకారులు త్వరిత గతిన శారీరక పటుత్వం కోల్పోయి తక్కువ వయసులోనే వృద్ధాప్యానికి చేరుకుంటారు. అలాంటి వారికి మిగిలిన వారిలా కాకుండా పది సంవత్సరాల ముందుగా పింఛన్ అందించి ఆదుకోవడం నిజంగా వరమే.

– వి.వినాయకం, తడ కుప్పం

జగన్ అంటేనే జనం

- 4న నాయుడుపేటలో 'మేమంతా సిద్ధం' సభ
- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సభా మైదానంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులు

నాయుడుపేట టౌన్: ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటేనే జనం అని, ఎన్నికల ప్రచారంలో భాగంగా మేమంతా సిద్ధం పేరిట చేపట్టిన బస్సు యాత్రకు ప్రజలు పోటెత్తుతున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ నెల 4వ తేదీన నాయుడుపేటలో నిర్వహించనున్న సభా ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. పట్టణ సమీపంలోని నరసారెడ్డికండ్రిగ వద్ద జాతీయ రహదారి పక్కన సభా మైదానాన్ని ఎంపీ అభ్యర్థి గురుమూర్తి, ఎమ్మెల్యే అభ్యర్థులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, మేరిగ మురళీధర్, ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కట్టా సుధాకర్ రెడ్డి తదితర నాయకులతో సందర్శించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి బస్సు యాత్ర ఈనెల 2 తేదీన అన్నమయ్య జిల్లా మదనపల్లె, 3న చిత్తూరు జిల్లా పూతలపట్టు, 4న తిరుపతి జిల్లా నాయుడుపేటలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గతంలో చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్ర కంటే మిన్నగా సిద్ధం సభలకు జనం నీరాజనాలు పడుతున్నారని తెలిపారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జరిగే బస్సు యాత్రలో స్థానికులతో మమేకమవుతున్నారని, అనంతరం సభలో భావోద్వేగంగా ప్రసంగిస్తున్నారని వివరించారు. ముఖ్యమంత్రి ప్రసంగానికి ప్రజలు కరతాళధ్వనులతో మద్దతు పలుకుతున్నారని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో 175 అసెంబ్లీ సీట్లు, 25 ఎంపీ స్థానాలను కైవసం చేసుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమని స్పష్టం చేశారు. అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేసి మేమంతా సిద్ధం సభను విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి, ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి, నాయకులు కామిరెడ్డి మోహన్‌రెడ్డి, కలికి మాధవ రెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, కటకం జయరామయ్య,ఒట్టూరు కిషోర్ యాదవ్, పాదర్తి హరినాథ్‌రెడ్డి, ముమ్మడి సుబ్బారావు యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట కృష్ణారెడ్డి, పాపాడి చంద్రారెడ్డి, మైనారిటీ నాయకులు రహంతుల్లా, రఫీ, నేతలు కొండూరు మనోహర్ రాజు, పి.రాహుల్ పాల్గొన్నారు.

పనులు ముమ్మరం : తలశిల రఘరామ్

నాయుడుపేటలో ఈనెల 4న నిర్వహించే మేమంతా సిద్ధం బహిరంగ సభ, బస్సు యాత్రకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను సీఎం ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ తలశిల రఘరామ్ పరిశీలించారు. ఎంపీ గరుమూర్తి, ఎమ్మెల్యే సంజీవయ్య, ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డితో కలసి సభా మైదానాన్ని పరిశీలించారు. పనులను ముమ్మరం చేసి త్వరితగతిన సభావేదికను సిద్ధం చేయాలని సూచించారు.

ప్రకటనలకు అనుమతి తప్పనిసరి



లక్ష్మీశ, కలెక్టర్

తిరుపతి అర్బన్ : మీడియాలో ప్రకటనలకు ఎంసీఎంసీ (మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ) అనుమతి తప్పనిసరని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి లక్ష్మీశ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల నేతలు ప్రకటనల కోసం మూడు రోజుల ముందే దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2 రోజుల్లో అనుమతులు జారీ చేస్తామని వెల్లడించారు. అయితే గుర్తింపు పొందని రాజకీయ పార్టీలకు సంబంధించి 7 రోజుల ముందే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ క్రమంలోనే పెయిడ్ న్యూస్‌లను సైతం కమిటీ నిరంతరం పరిశీలిస్తుందని వెల్లడించారు. నిబంధనలకు వ్యతిరేకంగా ప్రకటనలు, వార్తలను ప్రచురిస్తే ఆ ఖర్చును అభ్యర్థి ఖాతాలో జమ చేస్తామని స్పష్టం చేశారు.

అడ్డదారిలో అవ్వాతాతలకు అన్యాయం

- వలంటీర్లపై ఆరోపణలు హాస్యాస్పదం
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

వలంటీర్లపై బాబు వైఖరి దుర్మార్గం



ఎమ్మెల్యే భూమన

తిరుపతి మంగళం : ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా సేవలందిస్తున్న వలంటీర్లపై చంద్రబాబు వైఖరి దుర్మార్గమని టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. ఆదివారం తిరుపతిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. పేదవాడి ముంగిటకే సంక్షేమ పథకాలను అందిస్తున్న వలంటీర్లు ఇకపై సేవలందించకూడదనడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడు 1వతేది వస్తుందా జగన్ మనవడు అందించే పెన్షన్ తీసుకుందామా అని ఎదురుచూసే అవ్వాతాతల ఆశలపై చంద్రబాబు నీళ్లు చల్లడం బాధాకరమన్నారు. పేదలకు ప్రభుత్వ సేవలను ఇంటి ముంగిటకే తీసుకువచ్చి అందించే వలంటీర్లు నిస్వార్థ సేవకులను కొనియాడారు. వారిని అసత్య ఆరోపణలు, ఫిర్యాదులతో అడ్డుకోవాలని చూడడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

శ్రీకాళహస్తి: అవ్వాతాతలకు సకాలంలో పెన్షన్లు అందకుండా చంద్రబాబు అడ్డదారిలో నిమ్మగడ్డ రమేష్ ద్వారా అడ్డుకుని అన్యాయం చేశారని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పింఛన్లు సక్రమంగా అందడమే తమకు కావాలని, వలంటీర్లు కాదు స్వయంగా చంద్రబాబు, ఆయన కుమారుడు వచ్చి పంపిణీ చేసినా అభ్యంతరం లేదన్నారు. అవ్వాతాతలు, వితంతువుల, వికలాంగులకు దేశంలోనే ఎక్కడాలేని విధంగా రూ.3వేల పెన్షన్ అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. వలంటీర్లు ప్రచారం చేస్తున్నారని ఆరోపించడం హాస్యాస్పదమని, ఎవరో చెబితే ప్రజలు మారే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. లబ్ధిదారుడి ఇంటికే సంక్షేమ ఫలాలు అందించాలనే మహోన్నత ఆశయంతోనే వలంటీర్ వ్యవస్థకు జగనన్న శ్రీకారం చుట్టారని వెల్లడించారు. ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న వ్యవస్థపై చంద్రబాబు విషం చిమ్మడం బాధాకరమన్నారు. టీడీపీ, వైఎస్సార్ సీపీ అనే తేడా లేకుండా అర్హులందరికీ వలంటీర్లు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వివరించారు. కొందరు టీడీపీ నేతల తల్లిదండ్రులకు సైతం ఇంటికే వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. కోవిడ్ సమయంలో అందరూ ఇంటికే పరిమితమైతే, ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించిన వలంటీర్లపై వక్రంగా వ్యాఖ్యలు చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కేవలం పింఛన్‌పై ఆధారపడి జీవనం సాగిస్తున్న అవ్వాతాతల శాపం తప్పనిసరిగా టీడీపీకి తగులుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో శ్రీకాళహస్తీశ్వరాలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి, వైఎస్సార్ సీపీ నేతలు గుమ్మడి బాలకృష్ణయ్య, ఉన్నం వాసుదేవనాయుడు, చిట్టివేలు జయగోపాల్, కూనాటి రమణయ్యయాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మధురెడ్డి, దాము, ఆర్కాట్ శంకర్, పసల సుమతి, సుందరరామిరెడ్డి, గంగిరెడ్డి, చందమామల కోటయ్య, శ్రీరాములు, అమ్మపాళెం చిట్టి, గాదిపాకుల కిరణ్ పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ పునరాలోచించాలి

గతం టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ తీసుకునేందుకు అవ్వాతాతలు గంటల తరబడి ఎండలో నిలబడి సొమ్మసిల్లి పడిపోతే చంద్రబాబుకు చాలా ఆనందంగా ఉండేదని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆరోపించారు.పెన్షన్ల పంపిణీపై ఎన్నికల కమిషన్ పునరాలోచించాలని కోరారు.

పట్టణ నడిబొడ్డులో పచ్చి అబద్ధాలు

శ్రీకాళహస్తీశ్వరుని రాజకీయాల్లోకి లాగితే చంద్రబాబునాయుడు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం పట్టణంలోని భేరివారి మండపం వద్ద చంద్రబాబు చేపట్టిన ప్రజాగళం యాత్రలో చేసిన అసత్య ఆరోపణలను ఆయన ఖండించారు. శ్రీకాళహస్తిలో డ్రగ్స్ పెరిగిపోయిందని చంద్రబాబు చేసిన ఆరోపణలు అర్థరహితమని, డ్రగ్స్ గురించి తెలుసుకోవాలంటే సుధీర్‌రెడ్డిని అడిగితే తెలుస్తుందని స్పష్టం చేశారు. బొజ్జల సుధీర్‌రెడ్డిని పక్కన పెట్టుకుని ఇసుక మాఫియా గురించి మాట్లాడుతుంటే జనం నవ్వుకుంటున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో బొజ్జల సుధీర్‌రెడ్డి కచ్చితంగా ఓడిపోతారని, తర్వాత హైదరాబాద్ వెళ్లకుండా ఐదేళ్లు ఇక్కడే ఉండి శ్రీకాళహస్తి ప్రజలకు సేవ చేస్తానని ప్రమాణం చేయగలరా అని సవాల్ విసిరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

దురుద్దేశంతోనే ఆరోపణలు



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్ : పేదలకు సకాలంలో సక్రమంగా సేవలందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థపై దురుద్దేశంతోనే ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయని వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం పట్టణంలోని ఎన్‌జేఆర్‌భవనంలో విలేకర్లతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో విశేష సేవలందిస్తున్న వలంటీర్ వ్యవస్థను ఇతర రాష్ట్రాలు సైతం ఆదర్శంగా తీసుకున్నాయన్నారు. అవ్వాతాతలకు ఒకటో తేదీనే ఇంటికి వచ్చి పింఛన్ అందిస్తున్న సేవకులు వలంటీర్లని కొనియాడారు. పేదలకు మేలు చేస్తున్న వారిపై బురదజల్లేందుకు నిమ్మగడ్డ రమేష్ ద్వారా ఫిర్యాదు చేయించడం చంద్రబాబు దిగజారుడుతనానికి నిదర్శనమని ఆరోపించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలిపించి ప్రతిపక్ష పార్టీలకు గుణపాఠం నేర్పుతారని తెలిపారు. ఈ నెల 4వ తేదీన నాయుడుపేటలో నిర్వహించనున్న మేమంతా సిద్ధం సభకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బొలిగర్ల మస్తాన్‌యాదవ్ మాట్లాడుతూ టీడీపీలో బీసీలకు అన్యాయం జరుగుతుంటూ చూసి తట్టుకోలేకే వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. దీనిపై సోషల్ మీడియాలో కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, ఆర్టీసీ రీజనల్ కమిటీ మాజీ చైర్మన్ చెలికం శంకర్ రెడ్డి, పార్టీ పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, న్యాయవాది ఎల్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వలంటీర్లపై కక్షగట్టడం బాధాకరం



మాట్లాడుతున్న గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి మురళీధర్

గూడూరురూరల్ : ప్రజలతో మమేకమై విశేష సేవలందిస్తున్న వలంటీర్లపై ప్రతిపక్ష పార్టీలు కక్షగట్టడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని సనత్ నగర్‌లోని నివాసంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. దేశంలోనే గొప్ప వ్యవస్థగా కీర్తిగడించిన వలంటీర్లపై అసత్య ఆరోపణలు చేయడం దారుణమన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ సకాలంలో సంక్షేమ పథకాలను అందిస్తున్న వలంటీర్లను హేళన చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. చంద్రబాబు వక్రబుద్ధితోనే నిమ్మగడ్డ రమేష్ ద్వారా ఫిర్యాదు చేయించి వలంటీర్ల సేవలను అడ్డుకోవడం దుర్మార్గమని స్పష్టం చేశారు. టీడీపీ హయాంలోని జన్మభూమి కమిటీలకు, వలంటీర్ వ్యవస్థకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని వివరించారు. ఎన్నికల కమిషన్ మానవతా దృక్పథంతో ఆలోచించి వలంటీర్ల ద్వారా సామాజిక పింఛన్ల పంపిణీకి అనుమతి మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్లు నాశిన నాగులు, చోళవరం గిరిబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు



ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండు రోజులుగా నిర్వహించిన అండర్–17, 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీలకు మొత్తం 205 మంది బాలబాలికలు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబరచిన 12మందిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శులు ఎస్.జయరామయ్య, పి.విజయకుమారి పాల్గొన్నారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

తిరుపతి క్రైమ్: తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 29వ తేదీన చిత్తూరు జిల్లాలోని కార్వేటినగరం వద్ద ఓ మామిడి తోటలో పేకాట ఆడుతూ పట్టుబడిన కానిస్టేబుల్ పూర్ణచంద్రరావును పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఈ మేరకు విచారించిన జిల్లా పోలీస్‌శాఖ నివేదిక ప్రకారం చర్యలు చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వంద శాతం ఓటింగే లక్ష్యం

'సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నాం. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా కట్టుదిట్టంగా నిఘా పెడుతున్నాం. వంద శాతం ఓటింగే లక్ష్యంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ మేరకు యువతను అంబాసిడర్లుగా నియమించి ఎక్కడికక్కడ ఓటర్లను చైతన్యవంతం చేస్తున్నాం. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా పోలింగ్ పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం' అని సాక్షి ఇంటర్వ్యూలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి లక్ష్మీశ తెలిపారు. ఆయన మాటల్లోనే.. – తిరుపతి అర్బన్

- పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు
- ఆలోచింపజేసేలా మోడల్ పోలింగ్ కేంద్రాలు
- పటిష్ట బందోబస్తుకు చర్యలు



లక్ష్మీశ, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి

- నూతన జిల్లాగా ఏర్పడిన తర్వాత తిరుపతిలో తొలి సారి సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడం గొప్ప అవకాశంగా భావిస్తున్నాం.
- దేశంలో ఎక్కడా లేనివిధంగా ఓటర్లు ఆకట్టుకునేలా, ఆలోచింపజేసేలా మోడల్ పోలింగ్ కేంద్రాలనుఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.
- తిరుపతిలో శ్రీవారి ఆలయ నమూనాతో, శ్రీకాళహస్తిలో కలంకారీ, సూళ్లూరుపేటలో షార్, చంద్రగిరిలో చారిత్రాత్మక కోట నమూనతో, వెంకటగిరి చేనేత వస్త్ర తయారీ, పులికాట్ సరస్సు, శ్రీసిటీ, కొయ్యబొమ్మల ప్రాముఖ్యతను తెలుపుతూ మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాం.
- ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఒక్కో పోలింగ్ స్టేషన్‌లో ఒక సచివాలయ ఉద్యోగిని మాత్రమే నియమించనున్నాం.
- గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలున్న 120 మంది ఉద్యోగులను ఎన్నికల విధుల నుంచి తప్పించాం.
- ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను ఎన్నికల ప్రక్రియలోకి తీసుకోవడం లేదు. శాశ్వత ఉద్యోగులకు మాత్రమే ఎన్నికల విధులు కేటాయిస్తున్నాం.
- ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు సిబ్బందికి మూడు విడతలుగా శిక్షణ ఇవ్వాలి. అందులో ఇప్పటికే ఓ విడత శిక్షణ ఇచ్చాం. ఏప్రిల్ 18వ తేదీన నోటిఫికేషన్ విడుదల అయిన తర్వాత మరో రెండు విడతలుగా శిక్షణ ఇస్తాం.
- ఓటరు పోలింగ్ కేంద్రానికి వెళ్లిన తర్వాత అప్పటికే ఆ ఓటు పోలై ఉంటే టెండర్ ఓటు వేయవచ్చు. అలాగే ఏజెంట్లు అభ్యంతరం వ్యక్తం చేస్తే పోలింగ్ అధికారికి చలానా రూపంలో రూ.2 చెల్లించి చాలెంజ్ ఓటు కూడా వేసుకునే వెసులుబాటు ఉంది. అలాగే అండర్ ఏజ్ పేరుతో ఎవరైన అభ్యంతర పరిస్తే తగిన ఆధారాలు చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. తర్వాత విచారణలో ఎవరిది తప్పు ఉంటే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయి.
- ఎన్నికలకు వారం ముందు ఫారమ్–12డీ దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే హోమ్ ఓటింగ్‌కు అనుమతి ఉంటుంది.
- 85 ఏళ్లు దాటిన వారు సహాయకులతో పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయవచ్చు. అయితే సహాయకుడికి కూడా అదే పోలింగ్ కేంద్రంలో ఓటు ఉండాలి.
- జిల్లాలోని 294 రూట్‌లలో 2,136 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఆయా సెంటర్లకు ఈవీఎంలను కేటాయించాం. ఈ క్రమంలోనే 20శాతం అదనపు ఈవీఎంలను కూడా సిద్ధం చేశాం.
- ప్రతి 5 నుంచి 10 పోలింగ్ కేంద్రాలను సెక్టోరల్ అధికారులు పర్యవేక్షిస్తారు. పోలింగ్ రోజు ఈవీఎంలు మొరాయించినా నిముషాల్లోనే సరిచేసేందుకు సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నాం.
- జిల్లాలో 660 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించాం. అందులో 15 అత్యంత సమస్యాత్మక కేంద్రాలుగా నిర్ణయించాం. ఆయా సెంటర్లలో వెబ్ కాస్టింగ్, సీసీ కెమెరాలు అమర్చాం. వీడియో రికార్డింగ్‌కు చర్యలు చేపట్టాం. మైక్రో అబ్జర్వర్లు, ప్రత్యేక సిబ్బందిని పర్యవేక్షణకు నియమించనున్నాం.
- ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నాం. తొలి వరుసలో సెంట్రల్ ఫోర్స్, రెండో వరుసలో స్టేట్ ఫోర్స్, మూడో అంచెగా లోకల్ పోలీసులను నియమించేందుకు చర్యలు చేపడుతున్నాం. అలాగే కౌంటింగ్ కేంద్రాల వద్ద సైతం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాం.
- ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత ప్రతి ఉద్యోగి ఎన్నికల కమిషన్ పరిధిలోకే వస్తారు. వారి ఆదేశాలను మాత్రమే పాటించాల్సి ఉంటుంది.
- ఎన్నికల ప్రచారానికి సంబంధించి ప్రతి రాజకీయ పార్టీ తప్పనిసరిగా అనుమతులు పొందాల్సి ఉంటుంది. పబ్లిక్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యవహరించాలి. కోడ్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి.



వలంటీర్లు పరికరాలు అప్పగించాలి

తిరుపతి అర్బన్ : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వలంటీర్లు తమ వద్ద ఉన్న హ్యాండ్ హెల్డ్ పరికరాలతోపాటు మొబైల్, ట్యాబ్, ఇతర వస్తువులను కలెక్టరేట్‌లో అప్పగించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కోడ్ ఉల్లంఘించిన 11 మంది వలంటీర్లను విధుల నుంచి తొలగించామని వెల్లడించారు.

క్రీడలతో ఆరోగ్యం.. ఆనందం



మారథాన్‌ను ప్రారంభిస్తున్న సినీ నటుడు శ్రీరామ్

తిరుపతి కల్చరల్ : క్రీడలతో ఆరోగ్యంగా ఆనందంగా జీవించవచ్చని సినీ నటుడు శ్రీరామ్ తెలిపారు. ఆదివారం అలిపిరి గరుడ సర్కిల్ వద్ద ప్లే టూ లెర్న్ ఆర్టిజన్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2 కే మారథాన్‌ను ఆయన ప్రారంభించారు. శ్రీరామ్ మీడియాతో మాట్లాడుతూ ఆధ్యాత్మిక తిరుపతి నగరంలోని శ్రీవారి పాదాల చెంత ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ 2కే మారథాన్ చేపట్టడం సంతోషకరమన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ సందర్భంగా చేపట్టిన 2కే మారథాన్ ఎస్వీ జూ పార్క్‌వరకు సాగింది. ఇందులో పాల్గొన్న 400 మంది పిల్లలు, పెద్దలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్లే టూ లెర్న్ ఆర్టిజం కేర్ సెంటర్ చైర్మన్, ఎస్‌బీబీ మెడికేర్ చైర్మన్ కేవీ చౌదరి, ఎడిఫై ఇనిస్టిట్యూట్ చైర్మన్ ప్రణీత్, శుభమస్తు షాపింగ్ మాల్ ఎండీ వెంకటరవికుమార్, డాక్టర్ రణధీర్ రాజు చోళ రాజు సారా హాస్పిటల్స్ ఎండీ గడ్డం రవిశంకర్‌రాజు, గుడ్డి విష్ఆంధ్ర ఎండీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

'ఆపస్' ఇన్‌చార్జిల నియామకం

శ్రీకాళహస్తి: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా కార్యనిర్వాహక వర్గ సమావేశం నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో జిల్లా అధ్యక్షుడు నాగరాజు నేతృత్వంలో జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించారు. తిరుపతికి డాక్టర్ మొగ్గిమేకల దేవరాజులు, చంద్రగిరి పట్టాభి, శ్రీకాళహస్తి మునీంద్రబాబు, సత్యవేడు దాము, వెంకటగిరి రామ్మకృష్ణ, సూళ్లూరుపేటకు మోహన్‌కృష్ణ, గూడూరుకు వెంకటప్రసాద్ నియమితులయ్యారు. కార్యక్రమంలో చక్రపాణి, దేవరాజులు, దివాకర్, పట్టాభి, దాము, బలరామ్‌నాయుడు, రమేష్ పాల్గొన్నారు.

బిగుస్తున్న ఉచ్చు

- పూర్వపు రేణిగుంట తహసీల్దార్‌పై లోతుగా విచారణ
- బినామీలపై దర్యాప్తు.. మరో నాలుగు రోజులు తనిఖీలు
- రాష్ట్రస్థాయిలో సంచలనం రేపుతున్న తహసీల్దార్ శివప్రసాద్ అక్రమాస్తుల చిట్టా

సాక్షి టాస్క్‌ఫోర్స్: పూర్వపు రేణిగుంట తహసీల్దార్ శివప్రసాద్‌పై ప్రభుత్వ యంత్రాంగం లోతుగా విచారణ చేపట్టింది. డీటీ, తహసీల్దార్ పదవులను అడ్డుపెట్టుకుని అక్రమంగా సంపాదించిన సొమ్మును ఎక్కడెక్కడ? ఎవరెవరి పేరున ఉంచారనే దానిపై దర్యాప్తు చేస్తున్నారు. తాను పనిచేసిన చోట్ల, పరిచయం ఉన్న అధికారులు, బంధువులను సైతం విచారిస్తున్నారు. ఈ తనిఖీలు మరో నాలుగు రోజులు కొనసాగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అక్రమార్జనపై అవినీతి నిరోధకశాఖ కొరడా ఝుళిపించింది.

గతంలో రేణిగుంట తహసీల్దార్‌గా పనిచేసిన శివప్రసాద్ అక్రమాస్తులపై ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు జరిపి, భారీ స్థాయిలో అక్రమాస్తులను గుర్తించారు. తిరుపతి జిల్లా రేణిగుంట తహసీల్దార్‌గా దాదాపు మూడేళ్లపాటు పని చేసిన ఆయన అంతకుముందు ఏడాదిపాటు ఇక్కడే డీటీగా విధులు నిర్వహించారు. ఇంకా తిరుపతి రూరల్ రెవెన్యూ కార్యాలయంలో పనిచేశారు. ఏర్పేడు తహసీల్దార్‌గా ఉన్న శివప్రసాద్‌ని ప్రస్తుతం ఎన్నికల విధుల నిమిత్తం వైఎస్సార్ జిల్లా, కడప మండల తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. గతంలో అనేక ఆరోపణలు వచ్చినా, ఆయన ఏపీ రెవెన్యూ అధికారుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పదవిని అడ్డం పెట్టుకుని పైస్థాయిలో పలుకుబడులు పెంచుకుని ఎవ్వరినీ లెక్కచేయకుండా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. అవినీతి ఆరోపణలపై పక్కా ఆధారాలతో ఏసీబీ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో తిరుపతి ఏసీబీ అధికారుల ప్రమేయం లేకుండా విజయవాడ నుంచి ప్రత్యేక దర్యాప్తు బృందం దాడులు నిర్వహించింది.

గతంలో కలెక్టరేట్‌కు సరెండర్

రేణిగుంట తహసీల్దార్‌గా పనిచేసిన సందర్భంలో ఆయనపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సీసీఎల్‌ఏ స్థాయిలో విచారణ చేపట్టి, అక్రమాలు చేసినట్లు గుర్తించినట్లు తెలిసింది. ఆ సమయంలో శివప్రసాద్‌ని తిరుపతి కలెక్టరేట్‌కు సరెండర్ చేశారు. పాత పరిచాయాలతో ఓ అధికారి ద్వారా వారం రోజుల్లోనే సరెండర్ ఉత్తర్వులను రివర్షన్ చేయించి పక్క మండలమైన ఏర్పేడు తహసీల్దార్‌గా పోస్టింగ్ వేయించుకున్నారు. దీన్ని అధికారపార్టీ నేతలకు కట్టబెట్టే ప్రయత్నం చేశారు. రేణిగుంట మండలంలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను రియల్టర్లకు, బడాబాబులకు పట్టాలు చేయించి రూ.కోట్లు సొమ్ము వెనకేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. మండలంలోని పట్టాదారు పాస్ పుస్తకం మార్చుకోవాలన్నా, భూమి విలువను బట్టి ఎకరాకు రూ.లక్ష వరకు వసూలు చేశారని, అడిగిన మొత్తం ఇవ్వని రైతుల దరఖాస్తులను ఏవేవో సాంకేతిక కారణాలను చూపి తిరస్కరించారని బాధిత రైతులు వాపోతున్నారు. రేణిగుంటలో వంక పోరంబోకు స్థలాలు, ప్రభుత్వ భూములు, వివాదాస్పద స్థలాలే టార్గెట్‌గా ఆయన రియల్టర్లకు కట్టబెట్టి యథేచ్ఛగా ప్లాట్లు వేసి వాటాలు తీసుకున్నట్లు ఫిర్యాదులున్నాయి. విమానాశ్రయం సమీపంలో విలువైన స్థలాలను సైతం ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి కొందరు బడా బాబుల నుంచి రూ.కోట్లు ముడుపులు తీసుకుని ఆన్‌లైన్‌లో ఎక్కించారని ఆరోపణలున్నాయి. నేషనల్ హైవేకు భూములు కోల్పోయిన రైతులకు అందించే భూపరిహారం విషయంలోనూ అనేక అక్రమాలను పాల్పడినట్లు తెలుస్తోంది. ఏర్పేడు మండలం, విశ్వతమాల భూముల విషయంలోనూ అవకతవకలకు పాల్పడినట్లు, రేణిగుంట, ఏర్పేడు మండలాల పరిధిలో వందలాది మ్యుటేషన్లు చేసి అక్రమార్జన చేసినట్లు ఆరోపణలున్నాయి. రేణిగుంట విమానాశ్రయానికి వచ్చే వీఐపీ ప్రోటోకాల్ వ్యవహారాలు చూసుకుంటూ ఉన్నతాధికారులతో పరిచయాలు పెంచుకుని తన జోలికి ఎవ్వరూ రాకుండా అవినీతి సామ్రాజ్యాన్ని ఆయన విస్తరించారని, డబ్బుల వసూళ్లకు కూడా రెవెన్యూలో కొందరు కిందిస్థాయి ఉద్యోగులను బినామీలుగా పెట్టుకుని వారి ద్వారా వసూళ్లు చేసేవారని ఫిర్యాదులు వెళ్లాయి. రేణిగుంట మండలానికి చెందిన సతీష్ అనే వీఆర్‌వో, పూర్ణ అనే ప్రైవేటు వ్యక్తిని కార్యాలయంలో పెట్టుకుని ఏ ఫైల్ వచ్చినా, వీరిద్దరిని కలిశాక, బేరం కుదిరాకే తహసీల్దార్ టేబుల్ మీదకు ఫైల్ వెళ్లే తతంగం నడిచేదని రెవెన్యూలో పనిచేసే ఓ ఉద్యోగి చెప్పడం గమనార్హం. దీంతో ఏసీబీ అధికారులు రేణిగుంట మండలం, ఎలమండ్యం, ఎర్రమరెడ్డిపాళెంలో ఉన్న వీఆర్‌వో సతీష్, తిరుపతిలో ఉన్న ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్ ఇళ్లలోనూ శనివారం సోదాలు చేశారు. అదే విధంగా తిరుపతి అర్బన్, రూరల్ కార్యాలయాల్లో పనిచేసిన మరి కొందరు అధికారులను కూడా విచారించినట్లు విశ్వసనీయ సమాచారం. తహసీల్దార్ శివప్రసాద్‌పై ఏసీబీ దాడులు జరిగినట్లు తెలుసుకున్న రేణిగుంట మండలానికి చెందిన పలువురు బాధిత రైతులు, రియల్టర్లు కూడా సుమారు 50మంది వరకు ఏసీబీ అధికారులకు ఫోన్లు చేసి తమకు జరిగిన అన్యాయం గురించి, ఆయన అవినీతికి సంబంధించి మరిన్ని ఆధారాల సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రూ.80కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించిన ఏసీబీ అధికారులు మరిన్ని అక్రమాస్తుల చిట్టాను వెలుగులోకి తీసుకొచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరెడ్డి

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని దర్గావీధిలో ఉన్న ఓ జ్యువెలరీ దుకాణంలో ఈ నెల 17వ తేదీన చోరీకి పాల్పడిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 15 గ్రాముల బంగారు నగలు, 6 కేజీల వెండి వస్తువులు, రూ.వెయ్యి నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వివరాలు.. చిత్తూరు జిల్లా పుత్తూరు మండలం గోపాలకృష్ణాపురం గ్రామానికి చెందిన ఈటిపాకం నరేష్ వ్యసనాలకు బానిసై దొంగతనాలకు అలవాటు పడ్డాడు. గతంలో పలు చోరీ కేసుల్లో జైలుకు సైతం వెళ్లి వచ్చాడు. ఈ క్రమంలో నాయుడుపేటలోని నగల దుకాణంలో చోరీకి పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం పట్టణంలోని గాంధీపార్క్ రహదారి కూడలి వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న నరేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుడి నుంచి మొత్తం రూ.4.5 లక్షల సొత్తు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి అరెస్ట్‌లో కీలకపాత్ర పోషించిన ఐడీ పార్టీ హెడ్ కానిస్టేబుల్ చిరంజీవి, హోంగార్డు వెంకీని సీఐ అభినందించారు. సమావేశంలో ఎస్ఐ గోపి , హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్ రాజు, కానిస్టేబుల్ దయాకర్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR

Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry 9381287629

Real Estate

FLAT FOR SALE

Radhe Shyam Residency Flat No.124, 3 BHK, North Facing, 1st Floor, Karakambadi Road, Tirupati, Cell: 9441980827.

Tirupati, Lakshmipuram Circle, Beside Sumukhadivine Holidays, Flat No.301, 3BHK, 3rd Floor, West Face Flat for Sale, complete POP Interior Design 9738345630.

PLOTS FOR SALE

తిరుపతి బస్టాండ్ నుండి 9 K.Mలో తాజ్ 5 స్టార్ హోటల్, రాహుల్ కన్వెన్షన్ సెంటర్, తనపల్లి సుబ్రహ్మణ్యం స్వామి టెంపుల్ దాటగానే ఖమ్మపల్లి దగ్గర వెంటనే ఇల్లు కట్టుకునే Plots & విద్యానగర్ కాలనీ పక్కన L.S.నగర్ నందు కొత్త అపార్ట్‌మెంట్‌లో 2 BHK Flatsఅమ్మబడును. 9063731718.

TOLET

3 BHK Flat East Facing, Vasthu with latest Aminities, Cupboards, 24 Hrs Water, Rent/Lease, Opp.Guestlinedays Hotel, Bank Employees Colony, Tirupati, 9848226551.

Services

FOR SALE

తిరుపతిలో ప్రముఖ మినరల్ వాటర్ ప్లాంట్ ను అమ్మబడును. కెపాసిటీ (1 Hr 6000 Liter) వాటర్, సంప్ర: రాజీవ్ గాంధీ కాలనీ, రాఘవేంద్రనగర్, 98491 60929.

BUSINESS SERVICE

BUSINESS OFFER

కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేకోవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, 9773917835.

Wanted

ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్ (Education Institutions) లో పనిచేయుటకు Female Teli Calers కావలెను. సంప్రదించండి సెల్: 9133305005.

Business Development Executive How to earn 15,000- 20,000 P.M. Interview, 11 A.M-5 P.M. Trident Infra & Services, Near Leelamahal Circle, TPT, 8885888399, 8341325936.

Wanted Lady Receptionists-2 Members at Suhas Dental Care, Dr.Prasad, Airbypass Road, Tirupati, Cell: 9703511444.

సెక్యూరిటీ సూపర్‌వైజర్ జీతం:15,000, సెక్యూరిటీ గార్డ్ జీతం:12,000 PF&ESI రూం ఫ్రీ, రేణిగుంట సమీపం నందు పనిచేయుటకు కావలెను. 890404 0900, 8179196300.

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ తిరుపతి నందు పార్ట్ టైం/ఫుల్ టైంగా పనిచేయుటకు స్త్రీలు/ పురుషులు కావలెను. నెలకు లక్ష రూపాయలు సంపాదించే అవకాశం.9110327950.

తిరుపతిలో హౌస్ కీపింగ్ జాబ్స్ కలవు. & ఆటో డ్రైవర్ కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. సంప్రదించండి: 9177726001, 9121322808.

తిరుపతిలోపనిచేయుటకు సెక్యూరిటీ, సెక్యూరిటీ సూపర్‌వైజర్ కావలెను. మరియు ప్రముఖ బట్టల షాపులో పనిచేయటానికి సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M/F) కావలెను. అర్హత:10వ తరగతి ఉత్తీర్ణత లేదా ఫెయిల్. వయస్సు: 25 నుండి 50 సంప్ర: 8148552327, 9703681579.

వస్సబ్లీస్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15000 - 40000. ఫ్రీ రూమ్+భోజనం. HYD. ఫోన్: 9014885406.

Job Opportunities in Vijaya Bharathi Automobiles renowned at Tata Car Dealers. We are hiring Sales Team Leaders, Sales Advisors, Cashiers, Security Guard, Data Entry Operator, House Keeping Positions are in our Show Room with Salaries & Attractive Incentives, Share Resume @ hr.vba25@gmail.com, Contact: HR: 8008002186.

స్పాట్ జాయినింగ్, తిరుపతి, Vjd, Hyd. రైల్వేస్ నందు కాంట్రాక్ట్ ద్వారా SSC, ITI వాళ్లకు జాబ్స్ కలవు. జీ: 18,000–21,000, భోజనం & వసతి సౌకర్యం కలదు. 82979 22999.

రమణ విలాస్, రేణిగుంటలో పనిచేయుటకు సౌత్ ఇండియా మాస్టర్స్, సెక్యూరిటీ, వెయిటర్స్ కావలెను. సంప్రదించండి సెల్: 86392 58775.

Wanted Teachers for all subjects (Nursery to 7th)Principals and PROs, Veeksha The School, Bairagipatteda, Tirupati, 9989500074, 7386502450.

ప్రముఖ యూనివర్సిటీకి B.Tech అడ్మిషన్స్ చేయుటకు Lady Telecallers కావలెను. Qlf: Any Degree. Salary: 10K to 12K. Contact: 96400 60006.

గూడూరు, మేనకూరు పరిసర ప్రాంతాలలో పని చేయుటకు ASO & సెక్యూరిటీగార్డ్స్ కావలెను. 12hrs డ్యూటీ, జీతం+ PF, ESI కలదు. సంప్ర: 98189 71229, 97013 35889.

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకువర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9160900024/ 9640400073

మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 89197 39694.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బుల ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నాలుగులైన్ల ప్రకటనకు రూ. :375/- ప్రతి ప్రకటనపై
అదనపు లైనుకు రూ. : 90/- G.S.T 5% అదనం
CONTACT : 9440166091, 9951602970

వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ



వైఎస్సార్‌సీపీలో చేరిన కుంట్రపాకం వాసులతో చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్‌రెడ్డి



పార్టీలో చేరిన రణధీరపురంవాసులతో మోహిత్‌రెడ్డి

- పెద్దసంఖ్యలో చేరిన టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు

తిరుపతి రూరల్: మండలంలోని రణధీరపురంలో టీడీపీ, జనసేనకు చెందిన 60 మంది నేతలు, కార్యకర్తలు, కుంట్రపాకం పంచాయతీలో వంద కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సేవానిరతికి ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వెల్లడించారు. మోహిత్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకునేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తామని తెలిపారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి, సర్పంచ్ శుభ పద్మనాభరెడ్డి, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ కరముల వలీ, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డెయ్య, కుంట్రపాకం, రణధీరపురం ఉప సర్పంచ్‌లు మురళి, ఉమాపతి, పంచాయతీ అధ్యక్షులు అవినాష్ రెడ్డి, శ్రావణ్, కిషోర్, కోదండ రామయ్య, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

పార్టీలో చేరిన భరతయ్య

యర్రావారిపాలెం మండలం బోడేవాండ్లపల్లె మాజీ సర్పంచ్ భరతయ్య వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. ఆదివారం తుమ్మలగుంటలో ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు.

నాగలాపురం : మండలానికి చెందిన 200 మంది టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదివారం స్థానిక టవర్ క్లాక్ కూడలిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు, సర్పంచ్ చిన్నదొరై సుధా, జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, ఉప సర్పంచ్ సునీత, నాయకులు మహేష్ రెడ్డి, శ్యామ్, ఉదయ్‌కుమార్ రెడ్డి, దేశప్పన్, ఉదయ్ కుమార్, చిరంజీవి, ధనరాజ్, ప్రకాష్, దేశన్, కులశేఖర్, స్థానిక యువత సుమన్, ఆకాష్, సామ్రాజ్, సంతోష్, వినోద్ పాల్గొన్నారు.

బాబుకు ఓటమి భయం

పెళ్లకూరు: చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుందని, అందుకే యువగళం సభల్లో అభ్యర్థుల పేర్లు కూడా గుర్తుకు రావడం లేదని ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం చిల్లకూరులోని ఆయన నివాసం వద్ద పాలచ్చూరు, శిరసనంబేడు, అర్ధమాల, ఆర్లపాడు, పునబాక గ్రామాలకు చెందిన పలువురు టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత దేశ చరిత్రలో ఒక్క జగనన్నకే దక్కిందన్నారు. చంద్రబాబుకు దిక్కుతోచక జనసేన, బీజేపీలతో పొత్తు పెట్టుకున్నట్లు విమర్శించారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలంతా జగనన్న పక్షాన ఉన్నారని తెలిపారు. ఈనెల 4వ తేదీన నాయుడుపేటలో నిర్వహించనున్న మేమంతా సిద్ధం సభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు నన్నం ప్రిస్కిల్లా, పార్టీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పాలూరు మహేంద్రరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రఘునాయుడు, నాయకులు సతీష్‌రెడ్డి, లింగమనాయుడు, సురేష్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, గోపాల్, చంద్రయ్య, శ్రీనివాసులు, కుమారస్వామి, కృష్ణయ్య, రమణారెడ్డి, ఆనంద్, రాజారెడ్డి, రామచంద్రారెడ్డి, మల్లిరెడ్డి పాల్గొన్నారు.



మోహిత్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు



పార్టీలో చేరిన వారితో ఎన్‌డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి



పార్టీలో చేరిన వారితో నూకతోటి రాజేష్